## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


సాయిచరణ్


కృతిక

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఛాగల్లు జెడ్పీఎస్ఎస్‌కు చెందిన పి.సాయిచరణ్(10వ తరగతి), జె.కృతిక(8వ తరగతి) రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కొమురయ్య, పీడీ డాక్టర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా ముప్కల్‌లో జరుగనున్న 35వ సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కాగా, ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, పీడీతో పాటు స్టాఫ్ సెక్రటరీ ప్రకాశం, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పోగుల సారంగపాణి, కార్యదర్శి తోటకూరి గట్టయ్య, విద్యా కమిటీ చైర్మన్ బూర్ల అనీత, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ బాస్కుల సమ్మయ్య, మాదిరెడ్డి రాఘవరెడ్డి, అన్నెపు కుమార్ అభినందించారు.

### షూటింగ్‌బాల్‌కు సందీప్..


సందీప్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

పాలకుర్తి: మండలంలోని చెన్నూరు జెడ్పీఎస్ఎస్ విద్యార్థి ధరావత్ సందీప్ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం పుస్కూరి రమేశ్ తెలిపారు. మంగళవారం హెచ్‌ఎం మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన పోటీల్లో సందీప్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 24వ తేదీన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదుర్లలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సందీప్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పీడీ అశోక్ తదితరులు అభినందించారు.

### సన్మానం



జనగామ: జనగామ సీఐ సత్యనారాయణ రెడ్డిని పండ్ల వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షుడు పిట్టల రాజు తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఎండీ బషీర్, యూసుఫ్, కృష్ణ, సోహెల్, సంతు ఉన్నారు.

### మల్లయ్య పోరాటం మరువలేనిది

దేవరుప్పుల: పల్లెల్లో నిజాం పాలన ముగిసిన కాలానుక్రమంలో నెలకొన్న పాలేరు హక్కుల సాధనలో నల్ల మల్లయ్య పోరాటం మరువలేనిదని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మంగళవారం సీర్మాలలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన మల్లయ్య సంతాప సభకు మండల పార్టీ కార్యదర్శి ఇంటి వెంకటరెడ్డి అధ్యక్షతన వహించగా ఆయన మాట్లాడారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేశ్, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఊరెళ్తున్నారా.. జాగ్రత్తలు పాటించండి

రఘునాథపల్లి: బతుకమ్మ, దసరా ఉత్సవాల కోసం ఊరెళ్తున్నారా.. సొత్తు భద్రత కోసం పౌరులు తగిన జాగ్రత్తలు పాటించాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తాళాలు వేసిన ఇళ్లకు దొంగలు తమ చేతులకు పదును పెట్టే అవకాశముందన్నారు. ఊర్లకు వెళ్లాల్సి వస్తే విలువైన బంగారం, వెండి, ఆభరణాలు బ్యాంకు లాకర్లలో పెట్టడం ద్వారా భద్రత ఉంటుందన్నారు. చోరీల నియంత్రణకు సర్కిల్ పరిధిలోని రఘునాథపల్లి, చిల్పూర్, లింగాలఘణపురం మండలాల్లో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

### విద్యుత్ సౌకర్యం కల్పించాలి



లింగాలఘణపురం: మండలంలోని క్లైం డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు మంగళవారం సబ్ ఇంజనీర్ ఝాన్సీకి దరఖాస్తు చేసుకున్నారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కాలనీవాసులంతా కలిసి ఒక్కొక్కరు వ్యక్తిగత దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఐదేళ్లుగా కాలనీలో ఉంటున్న నిరుపేదలు కరెంట్ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారని, గతంలో కాంట్రాక్టర్ పెండింగ్ బిల్లులు కాలనీవాసులతో చెల్లించుకుని నేడు చీకట్లో పాములు, తేళ్ల మధ్య బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవదానం, ఉప్పలయ్య, సమ్మయ్య, సుల్తానా, విజయ, లావణ్య, రాఘవేంద్ర ఉన్నారు.

# రంగు మారిన తెల్ల బంగారం

- ఎడ తెరిపి లేని వర్షాలు.. రైతుల పరిస్థితి దయనీయం
- మురిగిపోతున్న కాయలు
- ఆందోళనలో రైతులు


ఇబ్రహీంపూర్‌లో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

రఘునాథపల్లి : నేల తల్లిని నమ్ముకుని తెల్ల బంగారమైన పత్తి పంటను సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కోటి ఆశతో అప్పు చేసి సాగు చేసిన పత్తి పంటకు ఎడతెరిపి లేని వర్షాలకు తెగుళ్లు సోకి ఉన్న కాయలు మురిగిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 19,803 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. ఈ ఏడాది వర్షాలు బాగానే ఉండటంతో పంట ఏపుగా పెరిగిందే తప్ప కాపు మాత్రం అంతంత మాత్రంగానే వచ్చింది. నల్ల రేగడి భూముల్లో వర్షాలకు పత్తి పంట ఎరుపు రంగులోకి మారి నష్టాన్ని మిగిల్చుతోంది. పంటను కాపాడుకోవడానికి మందులు పిచికారీ చేయాల్సి రావడంతో పెట్టుబడి ఖర్చులు తడిసి మోపడవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీటీ రకం పత్తికి పొగాకు లద్దె పురుగు ఆశించేది కాని ఈ సారి వ్యాపించి పత్తి పంటను తినేస్తూ నష్టం చేస్తోంది. ఎకరాకు రూ 30 వేలకు పైగా పెట్టుబడి పెరిగినా పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుందని, చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని రైతులు తలల పట్టుకుంటున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

### చేనులోనే కాయలు మురిగిపోతున్నాయి



నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా వర్షాల కారణంగా తెగుళ్లు సోకాయి. ఈ సారి లద్దె పురుగు కూడా ఆశిస్తే పురుగు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. ఇప్పటికే రూ. లక్షకు పైగా పెట్టుబడి పెట్టా. వర్షాలకు చేనులో ఉన్న కొద్దిపాటి కాయలు మురిగిపోతున్నాయి. గతంలో ఎకరాకు దాదాపు 12 క్వింటాళ్ల దిగుబడి రాగా ఈ సారి కనీసం 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలి.

\- గాజులపాటి మైసారావు, ఇబ్రహీంపూర్

### వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



పంటలకు తెగుళ్లు వ్యాపిస్తే రైతులు తప్పనిసరి వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. అధిక వర్షాలకు వేరుకుళ్లు, ఆకుమచ్చ తెగుళ్లు, ఆకులు వాడిపోవడం జరుగుతుంది. దీని నివారణకు ఒక లీటరు నీటిలో కార్బండాజిం-1 గ్రాము, లేదా మాంకోజెబ్-2.5 గ్రా. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లద్దె పురుగు నివారణకు 200 లీటర్ల నీటిలో ఏమమేక్టిన్ బెంజాయేట్ 100 గ్రాములు కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

\- కాకి శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి

# నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన నిధులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నాణ్యతాప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈఈ శ్రీనివాస్, డీఈ రామలింగాచారి, స్పెషల్ ఏఈ శ్రీనివాస్, ఏఈలు రాహుల్, మహేష్, పంచాతీయరాజ్ అధికారులు పాల్గొన్నారు.

### నేడు వైద్యశిబిరం

దేవరుప్పుల: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు(బుధవారం) ఉదయం ప్రత్యేక స్త్రీ వైద్య నిపుణులతో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు మండల వైద్యాధికారి రాజపురి రవితేజ సూచించారు. ఈ వైద్యశిబిరానికి జనగామ ఏరియా ఆస్పత్రి గైనకాలజిస్టు ఆఫీపా నజ్నిన్ ఉచిత వైద్యచికిత్సలు చేసి అవసరార్థులను పై ఆస్పత్రులకు సిఫారసు చేస్తారని పేర్కొన్నారు. ఇలాంటి ఉన్నత వైద్యుల వైద్య శిబిరాలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పీహెచ్‌సీలో బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ ఆడుతున్న వైద్య సిబ్బంది

నర్మెట: మండలంలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగలో భాగంగా మూడో రోజు మంగళవారం ముద్దపప్పు బతుకమ్మగా గౌరమ్మను ఆరాధించి నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డా.ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది బతుకమ్మలను పేర్చి ఆటలు ఆడి పాటలు పాడుతూ కోలాటాలు వేశారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీదేవి హాజరై బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోబెల్స్ ప్రచారం, మోసాల్లో శ్రీహరి దిట్ట

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

లింగాలఘణపురం: గోబెల్స్ ప్రచారంతో పాటు అడుగడునా మోసాలు చేయడంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి దిట్ట అని మాజీ ఎమ్మెల్యే రాజయ్య విమర్శించారు. మంగళవారం మండలంలోని మంథోనిగూడెం, క్లైం, సిరిపురం, జీడికల్, నాగారంలో 'ఊరూరా బీఆర్‌ఎస్ అభివృద్ధి, సంక్షేమాలు -ఇంటింటికి కేసీఆర్ పథకాలు' అనే పేరుతో గ్రామాల్లో పర్యటించి అనంతరం నాగారంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెయ్యి కోట్ల అభివృద్ధి చెప్పుకోవడమే తప్ప ఏ ఒక్క పని మొదలు కాలేదని మండిపడ్డారు. ఎన్టీ రామారావును మొదలుకుని చంద్రబాబునాయుడు, కేసీఆర్ వరకు అందరిని మోసం చేసి అధికార పార్టీల్లో చేరుతూ పదవులు అనుభవించాడని విమర్శించారు. శ్రీనివాసు, సంపత్, భాస్కర్‌రెడ్డి, శేఖర్, వీరయ్య, మదార్, మురళి, వెంకటేశ్, భాగ్యలక్ష్మి ఉన్నారు.

# పెరుగుతున్న ఆర్థిక అసమానతలు


మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

జనగామ రూరల్: దేశంలో పెట్టుబడిదారి విధాన ఫలితంగా ఆర్థిక అసమానతలు, పేదరికం పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో కార్మిక ఉద్యమ నాయకుడు బొట్ల శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, సింగారపు రమేశ్, సాంబరాజు యాదగిరి, బొట్ల శేఖర్, హనుమకొండ జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ గోపాల్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### శిశువుకు తల్లిపాలు శ్రేయస్కరం



బచ్చన్నపేట: శిశువుకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనోహర అన్నారు. మంగళవారం గోపాల్‌నగర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ సంబురాలను జరిపి, ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు పర్వతం భాగ్య, లక్ష్మి, ఆయాలు అంబవ్వ, యాదలక్ష్మి, టీచర్లు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

### పింఛన్లు పెంచి ఇవ్వాలి

బచ్చన్నపేట: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా పింఛన్లు పెంచి అందించాలని ఆలింపూర్ ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు కొమ్ము శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి రేవతికి వినతి పత్రాన్ని అందించారు. పింఛన్ దారులు పాల్గొన్నారు.

### 'ప్రతిపక్షాల మౌనంతో ఖూనీ కానున్న ప్రజాస్వామ్యం'

దేవరుప్పుల: కేంద్ర ప్రభుత్వ పాశవిక హత్యాకాండలను నిలువరించే విషయంలో ప్రతిపక్ష పాలకవర్గాలు మౌనం దాల్చితే ప్రజాస్వామ్యంను ఖూనీ చేసిన వారవుతారని ఉస్మాయనియా విశ్వవిద్యాలయం జేఏసీ నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. హిందూ మతం పేరిట ప్రజలను పక్కదారి పట్టిస్తున్న బీజేపీ ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలకు దండకారణ్యంలోని సహజ వనరుల దోపిడీకి తాడిత, పీడిత ప్రజల కోసం పోరాడుతున్న మావోయిస్టు పార్టీతో చర్చలకు సిద్ధం అని ప్రకటించి ఆపరేషన్ కగార్‌తో నిత్య హత్యాకాండ కొనసాగిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ కగార్ ఆపరేషన్‌లో తెలుగు రాష్ట్రాల నేతలను హతమార్చడాన్ని తెలంగాణ రాజకీయ పార్టీలు, పౌర సమాజం ఖండించాలని కోరారు.

### డీఎంను కలిసిన గ్రామస్తులు

బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామస్తులు జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ స్వాతిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు గతంలో గ్రామానికి వచ్చే పికెట్ బస్సు రావడం లేదని, పునరుద్ధరించాలని కోరారు. వెంటనే డీఎం స్పందించి బస్సును పునరుద్ధరించడంతో ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. మల్లవరం వెంకటేశ్వర్‌రెడ్డి, కాపర్తి హరిప్రసాద్, యాదండ్ల శ్రీనివాస్, భాస్కర్, తిరుపతి, నలగొప్పుల బాలరాజు, రవి పాల్గొన్నారు.

### ఇళ్ల స్థలాలు అందించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: పాంనూర్ గ్రామంలో అర్హులైన నిరుపేద దళితులకు ఇళ్ల స్థలాలు అందించాలని దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు కలకోల యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలోని పేద దళితులతో కలిసి ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీను, సుమన్, శివరాజ్, రాజ్‌కుమార్, కొమురయ్య, సోములు, నరేందర్, కిరణ్, ఐలయ్య, యాకస్వామి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందిన సంఘటన బసిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతు తీగల సిద్దులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయంత్రం మేతకు వెళ్లిన పశువులను తిరిగి పాకకు తీసుకొస్తుండగా తెగిపడిన మేన్‌లైన్ విద్యుత్ వైరును గేదె తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ. 1.50లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## మత్తడి పోస్తున్న ఏడునూతుల చెరువు


మత్తడి పోస్తున్న చెరువు

కొడకండ్ల: సీజన్‌లో సరైన వర్షాలు లేక చెరువు, కుంటలు నిండక బోర్‌బావుల్లో జలాలు అడుగంటిపోయి పంటలకు నీరందని పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్న తరుణంలో రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలు అన్నదాతల్లో ఆనందాన్ని రేకెత్తించాయి. ఎగువ ప్రాంతం నుంచి వరద నీటి ప్రవాహంతో నీళ్ల లేక వెలవెలబోయిన ఏడునూతుల పెద్ద చెరువు నిండుకుంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి పెద్ద చెరువు మత్తడి పోస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వరదల్లో ఇద్దరికి తప్పిన ప్రాణాపాయం


కొట్టుకుపోతున్న వాహనాన్ని బయటికి తీస్తున్న స్థానికులు

దేవరుప్పుల: రెండు రోజులుగా కురుస్తున్న వర్షపు వరదల్లో ఇద్దరికి ప్రాణాపాయం తప్పిన ఘటన రామచంద్రాపురంలో చోటుచేసుకుంది. గ్రామ పరిధి రాసముద్రం చెరువు నిండి మత్తడి అలుగు పోయడంతో ఆ గ్రామంలోకి వెళ్లే ప్రధాన దారిలో సోమవారం రాత్రి దాటలేని పరిస్థితి ఏర్పడింది. ఈ దారి గుండా రామన్నగూడెం, చౌడూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనాలపై వెళ్తుండగా నీటి ప్రవాహాన్ని తట్టుకోలేక బైక్‌లు వదిలి వరదల నుంచి బయటపడ్డారు. మంగళవారం ఉదయం స్థానికుల సహకారంతో ఆ రెండు వాహనాలను వరదనీటి ప్రవాహం నుంచి బయటకు తీయడం అక్కడి రవాణా సౌకర్యాల ఇబ్బందులకు అద్దం పడుతోంది.

## ప్రమాదకరంగా కల్వర్టు


గానుగుపహడ్ గ్రామ శివారులో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

జనగామ రూరల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గానుగుపహడ్ వద్ద నిర్మాణంలో ఉన్న తాత్కాలిక రోడ్డు కొటుకుపోయిన విషయం విదితమే. కాగా, జనగామ నుంచి హుస్నాబాద్‌కు వెళ్లే వాహనాలు గానుగుపహడ్ గ్రామం నుంచి దారి మళ్లించారు. దీంతో గ్రామం శివారులో మరో కల్వర్టు వాహనాల రాకపోకలతో దెబ్బతింటోంది. నిత్యం జనగామ నుంచి వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుండడంతో రోడ్డు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, మంగళవారం ఇరిగేషన్ డీఈ, ఏఈ, ఎంపీడీఓలు వాగును పరిశీలించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

# జిల్లా ఆస్పత్రి ఎదుట వైద్యుల నిరసన


నిరసన తెలుపుతున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

జనగామ: మహబూబాబాద్ మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై దాడిని నిరసిస్తూ జనగామ వైద్య కళాశాల, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అధ్యాపకులు, నర్సింగ్ ఆఫీసర్లు, పారమెడికల్ సిబ్బంది, వైద్య విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం జీజీహెచ్ ఎదుట నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి దాడికి గురైన వారికి మద్దతుగా సంఘీభావం ప్రకటించారు. ఎంసీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్లు అనురాధ, అన్వర్, మధుకర్ యాదవ్, కల్నల్ భిక్షపతి, కరుణాకర్‌రాజు తదితరులు నిరసనలో పాల్గొని మాట్లాడారు. 60శాతం కన్నా తక్కువ ఆక్సిజన్‌తో అపస్మారక స్థితిలో ఆస్పత్రికి వచ్చిన రోగి చనిపోతే.. వైద్యులు, మెడికల్ సూపరింటెండెంట్‌పై దాడి చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్లకు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషల్ పోలీస్ ప్రొటెక్షన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు


కొడకండ్ల: మాలధారులకు ఎన్ఆర్ఐ స్వర్ణ దామోదర్‌రెడ్డి పంపిన రూ.15వేల నగదును అందజేస్తున్న స్థానికుడు మనోహర్


జనగామ: గిర్నిగడ్డ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో..


జనగామ: గణపతి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సాక్షి నెట్‌వర్క్: దేవీ శరన్నవరాత్రోత్సావాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపాల్లో అమ్మవారి విగ్రహాలకు పూజలు, అర్చనలు నిర్వహించారు. రెండో రోజు మంగళవారం అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. కాగా, పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు.


స్టేషన్‌ఘన్‌పూర్: ఎల్లమ్మగుడి వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


పాలకుర్తి టౌన్: గాయత్రీ దేవి అలంకరణలో..


దేవరుప్పుల: సీతారాంపురంలో..

# పేదల సంక్షేమమే మోదీ ధ్యేయం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్


మాట్లాడుతున్న రమేశ్

జనగామ రూరల్: పేదల సంక్షేమమే ప్రధాని నరేంద్ర మోదీ ధ్యేయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ పేదలకు లబ్ధిచేకూరే విధంగా జీఎస్టీని తగ్గించారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు శశిధర్ రెడ్డి, కొంతం శ్రీనువాసు, అంజి రెడ్డి, నవీన్ రెడ్డి, తోకల ఉమా రాణి, దేవర ఎల్లయ్య, దుంపల సంపత్, సతీష్, రవి రాజా, పట్టణ అధ్యక్షుడు అనిల్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి జగదీశ్, కార్యదర్శి శివకృష్ణ, యువ మోర్చా నాయకుడు మహిపాల్, యాదగిరి,అమరేందర్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ పాఠశాల తనిఖీ


ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న సాంబశివరావు

జనగామ రూరల్: మండల కేంద్రంలోని చౌడారం మోడల్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు ధరణి కమ్యూనికేషన్స్ కేంద్రంలో క్షేత్రస్థాయిలో ఆన్‌లైన్‌పై అవగాహన కల్పిస్తున్నారు. కాగా, వృత్తి విద్య ఐటీ ఐటీఎస్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఒకేషనల్ కోఆర్డినేటర్ సాంబశివరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఉపాధ్యాయుడు రాములు ఆయనకు తెలిపారు. ప్రిన్సిపాల్ కె. సుధీర్ రెడ్డి, కేంద్రం నిర్వాహకుడు ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.